బయటికెళ్లాలంటే భయం భయం

- దాడులకు తెగబడుతున్న కుక్కలు
- గుంపులుగా చేరి స్వైరవిహారం
- గ్రామ సమీపంలో చికెన్ వ్యర్థాలు
- దృష్టిసారించని అధికారులు



పీచరలో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో వాహనదారులు, బాటసారులను వెంబడించి దాడులకు తెగబడుతున్నాయి. రాత్రి సమయంలో రోడ్లపైకి కుక్కలు గుంపులుగా వచ్చి స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గొర్రెలు, మేకలు, ఇతర పశువులపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని మద్యలవాగులో చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను పడేస్తుండడంతో కుక్కలు పదుల సంఖ్యలో అక్కడకు చేరుకుని రోడ్డుపైనే సంచరిస్తూ వచ్చిపోయే వారిపై దాడులు చేస్తున్నాయి. పీచర గ్రామంలోని కెనాల్ కాల్వల్లో చికెన్ వ్యర్థాలు వేస్తుడటంతో ఆదారి గుండా వెళ్లే వాహనదారులపైకి ఎగబడుతున్నాయని పలువురు తెలిపారు. అలాగే పాఠశాలకు వెళ్లే చిన్నారులు వీధి కుక్కల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండటంతో ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని ఆయా గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణకు కొన్నేళ్లుగా అధికారులు ఎలాంటి చొరవ తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రత్యేకాధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

బయటికెళ్లాలంటే భయమేస్తోంది



మా గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రోడ్లపైకి గుంపులుగా చేరి దాడులకు తెగబడుతున్నాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– ఎండీ.ఆరీఫ్, వేలేరు

ఆపరేషన్ చేయించాలి



కుక్కల వలన వీధుల్లో ఒంటరిగా వెళ్లాలంటే ధైర్యం సరిపోవడం లేదు. కుక్కలు చప్పుడు కాకుండా వెనక నుంచి వచ్చి కరుస్తున్నాయి. వాహనాలపై వెళుతుంటే వెంటపడి తరుముతున్నాయి. అధికారులు స్పందించి కుక్కల సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించాలి.

– వేల్పుల రవి, ఇచ్చుళ్లపల్లి

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రాజు


మాట్లాడుతున్న రవీందర్‌రాజు

దామెర : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల మహాత్మా జ్యోతిరావుపూలే, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రచురించిన విధంగా పెండింగ్ డీఏలను ఏకకాలంలో విడుదల చేయాలన్నారు. పీఆర్సీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, పదోన్నతులను చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల పని వేళలను వెంటనే మర్చాలని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల అధ్యక్షుడు సుదర్శన్, బీసీ గురుకుల ఉపాధ్యాయుల జిల్లా కన్వీనర్ అశోక్, టీఎస్ యుటీఎఫ్ మైనారిటీ వింగ్ అధ్యక్షుడు భిక్షపతి, ఉపాధ్యాయులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి నిధుల మంజూరు


ప్రణవ్ చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ అందుకుంటున్న ఝాన్సీరాణి

కమలాపూర్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.69.50 లక్షలు మంజూరైనట్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణిరవీందర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నుంచి విడిపోయి స్వతంత్ర మార్కెట్‌గా ఏర్పడిన కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో చైర్మన్ చాంబర్, మీటింగ్ హాల్ లేకపోగా, మార్కెట్‌యార్డు చుట్టూ నిర్మించిన ప్రహరీ కొంతభాగం కూలిపోయింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ నుంచి కమలాపూర్ మార్కెట్ యార్డులో చైర్మన్ చాంబర్, మీటింగ్ హాల్ నిర్మాణం కోసం రూ.63 లక్షలు, ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.16.50 లక్షలు కలిపి మొత్తం రూ.69.50 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిధుల మంజూరుకి సహకరించిన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ తదితరులకు మార్కెట్ కమిటీ పాలక మండలి తరఫున ఆమె కృతజ్ఞతలు తెలిపారు. డైరెక్టర్లు కిన్నెర కృష్ణమూర్తి, సముద్రాల కృష్ణ, గట్టు శ్రీధర్, ఆకినపల్లి భిక్షపతి, ఓర్సు తిరుపతి, విజేందర్, శివకృష్ణ, లింగయ్య, యాకూబ్‌పాషా, దయాకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మయుద్ధం మహాసభను జయప్రదం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

- ముల్కనూరులో కరపత్రం ఆవిష్కరణ

ఎల్కతుర్తి : ఎస్సీ, ఎస్టీ, బీసీ రాజ్యాధికార సాధన కోసం ఈనెల 20న హుస్నాబాద్‌లో నిర్వహించతలపెట్టిన రాజ్యాధికార ధర్మయుద్ధం మహాసభను జయప్రదం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు బోయిని సదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రజా గ్రంథాలయం ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలే ఎక్కువగా ఉన్నారని, వారికి కనీస అవసరాలైన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. రాజ్యాధికార స్థాపనకై నిర్వహించే ధర్మయుద్ధ మహాసభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు, యువకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా డాక్టర్ విశారధన్ మహారాజ్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, ఎల్లన్న, బాబు, చందు, భరత్ పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) భీమారం శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ - కరీంనగర్ జాతీయ రహదారిలోని భీమారం సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భానుప్రసాద్ మాట్లాడుతూ.. రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. పరీక్షలు రాయడానికి అనుమతి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఆగడాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే భీమారంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు బొంకూరి భాను, కార్యదర్శి పి.సుధీర్, ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, అక్షయ్, రాజు, కొట్టె వంశీ పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం


శాయంపేట : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి

శాయంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయడం చరిత్రాత్మక నిర్ణయమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ప్రతిపక్షాల ఎన్ని విమర్శలు చేసినా స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసి బీసీలకు 42శాతం రిజ్వరేషన్ కల్పించిన ఘనతా సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాయకులు శాంతరవి, రవి, మార్కండేయ, సుదర్శన్, కుమారస్వామి, రాజేందర్, సంపత్, కుమారస్వామి, రాజు, రఫీ, ఆ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


ఐనవోలు : సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


ఐనవోలు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం మండల కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గం, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేలా రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. బీసీ సంఘాల నాయకులు మాత్రం సంతోషంగా ఉన్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేస్తుందని ఆశాభావ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్ కట్కూరి సునీల్, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ దొంగిలించి.. డబ్బులు డ్రా చేసి


- ఒకరి రిమాండ్

దామెర : సెల్ ఫోన్ దొంగతనం చేయడంతో పాటు డబ్బులు డ్రా చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. నడికూడ మండలంలోని సర్వాపురం గ్రామానికి చెందిన కొమురాజు గణేశ్ వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 5వ తేదీన గ్రామంలోని ఓ పెళ్లి సందర్భంగా టేబుల్‌పై సెల్ ఫోన్ పెట్టి వంటలు చేస్తున్నాడు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు గణేష్ సెల్ ఫోన్ దొంగిలించారు. అకౌంట్ నుంచి డబ్బు డ్రా చేసేందుకు గణేశ్ బ్యాంకుకు వెళ్లగా అకౌంటు నుంచి రూ.95,000 మాయం అయ్యాయని తెలిసింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీస్‌లు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేయగా భూపాలపల్లి జిల్లా కొయ్యూరుకు చెందిన బోరిగం సంపత్ సెల్ ఫోన్ దొంగిలించినట్లు గుర్తించారు. సంపత్‌ను విచారించగా ఫోన్ దొంగిలించి లాక్ ఓపెన్ చేసి ఖాతాలో ఉన్న డబ్బులు డ్రా చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు గొప్పవి



హన్మకొండ: కార్మికులకు పీపీఈ కిట్లు అందిస్తున్న 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి

హన్మకొండ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు గొప్పవని, ఈ క్రమంలో వారు తమ ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలని 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సూచించారు. హనుమకొండ టీవీ టవర్ కాలనీలోని స్వగృహంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయిల్, సబ్బులు, గ్లౌజులు, ఆప్రాన్, టవల్ ఈ కిట్‌లో ఉంటాయన్నారు. వాటిని వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌డబ్ల్యూఎస్ నల్ల సుధాకర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.బాషా నాయక్, జవాన్లు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వసంత

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

హన్మకొండ: మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. హనుమకొండ భవానినగర్ రోడ్డు నంబర్ -4బీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మహేందర్ రెడ్డి, జవాన్లు సతీష్, భిక్షపతి, విక్కి మహేష్, భవాని నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ప్రకాష్ రావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.


కాజీపేట అర్బన్: మున్సిపల్ కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వర్‌రావు

కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కాజీపేట అర్బన్: మున్సిపల్ కార్మికులు తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు అన్నారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులకు శానిటేషన్ కిట్లను కార్పొరేటర్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విధులు నిర్వహిస్తున్న తరుణంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సిబ్బంది చంద్రమౌళి, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటితే ఉద్యోగం


కంపెనీ ప్రతినిధులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కమల్ యాదవ్, తదితరులు

మామునూరు: ఫార్మసీ విద్యార్థులు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రతిభ కనబరిస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయని వాగ్దేవి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ యాదవ్ అన్నారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ప్రముఖ ఫార్మా సంస్థ, డీవీస్ ల్యాబొరేటరీస్ క్యాంపస్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ శనివారం జరిగింది. డ్రైవ్‌లో రాష్ట్రంలోని వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి 200కు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కమల్ యాదవ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు దేశ, విదేశాల్లో ఎక్కువగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ శివకుమార్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి దుర్మరణం



హసన్‌పర్తి: కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి ఓ గీత కార్మికుడు దుర్మరణం చెందిన సంఘటన హసన్‌పర్తి మండలం మడిపల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బుర్ర కుమారస్వామి(49) శుక్రవారం సాయంత్ర కల్లుగీయడానికి వనానికి వెళ్లాడు. ఈ క్రమంలో చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు


చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న మహిళా రైతు స్వరూప

వేలేరు : పంట పొలాల్లో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. పొలాలు చదను చేసే సమయం కావడంతో తీగలు ట్రాక్టర్‌కు, పంటకోసే సమయంలో హార్వెస్టర్‌కు తగిలే ప్రమాదం ఉందని వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించలేదని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

కేసు నమోదు

ఆత్మకూరు : తమపై దాడిచేసి తన కోడలును కిడ్నాప్ చేశారంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడెప్పాడ్‌కు చెందిన ఇర్సడ్ల సదానందం శనివారం ఇంట్లో ఉండగా కారులో ఐదుగురు వచ్చి తనను, తన భార్య రాణి, కుమారుడు వంశీ కృష్ణపై దాడిచేసి తన ఫోన్ లాక్కొని తన కోడలు ఇర్సడ్ల సాయిశృతిని తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దాడిచేసిన వారిలో సాయిశృతి తల్లి ఏడాకుల సౌందర్య, ధనలక్ష్మి ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

వరంగల్ చౌరస్తా: కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక సేవ పతకానికి ఎంపికైన వరంగల్ ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్‌ను స్థానిక కార్పొరేటర్ గందె కల్పన – నవీన్ దంపతులు శనివారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

మండల కమిటీ నియామకం



వేలేరు : సేవాలాల్ గోర్‌సేన మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆంగొతు సాంబయ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా లోక్యాతండా గ్రామానికి చెందిన మురావత్ రాజు, ఉపాధ్యక్షుడిగా చింతలతండా గ్రామానికి చెందిన మాలోతు భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా మాలోతు శ్రీకాంత్, కార్యదర్శులుగా మాలోతు రమేశ్, రమణ, కోశాధికారిగా బానోతు అశోక్, మీడియా కన్వీనర్‌గా సంపత్, సలహదారులుగా లక్ష్మణ్‌నాయక్, సాంబరాజు, అమర్‌సింగ్, సంపత్, రాంచదర్ ఎన్నికైనట్లు తెలిపారు.

కేసు నమోదు

ఆత్మకూరు : తమపై దాడిచేసి తన కోడలును కిడ్నాప్ చేశారంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడెప్పాడ్‌కు చెందిన ఇర్సడ్ల సదానందం శనివారం ఇంట్లో ఉండగా కారులో ఐదుగురు వచ్చి తనను, తన భార్య రాణి, కుమారుడు వంశీ కృష్ణపై దాడిచేసి తన ఫోన్ లాక్కొని తన కోడలు ఇర్సడ్ల సాయిశృతిని తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. దాడిచేసిన వారిలో సాయిశృతి తల్లి ఏడాకుల సౌందర్య, ధనలక్ష్మితో పాటు మరో పదిమంది ఉన్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



దామెర : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఆటోనగర్‌కు చెందిన వంగ భరత్‌సాయి సులువుగా డబ్బు సంపాదించాలని ఛత్తీస్‌గఢ్ నుంచి గంజాయి తీసుకొచ్చి బస్టాండ్ ఏరియాల్లో విక్రయిస్తున్నాడు. మిగిలిన గంజాయిని విక్రయించేందుకు శనివారం మండలంలోని ల్యాదెళ్ల సమీపంలోని సిరి క్రషర్ వైపు సంచిలో తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులకు అనుమానం వచ్చి విచారించగా గంజాయి విక్రయించేందుకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో అతని వద్ద ఉన్న 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.27,500 ఉంటుందని వెల్లడించారు. భరత్‌సాయిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

నేడు 'బుద్ధుడితో నా ప్రయాణం' నృత్య రూపకం

హన్మకొండ కల్చరల్: గౌతమ బుద్ధుడి జీవిత విశేషాలను తెలిపే బుద్ధునితో నా ప్రయాణం నృత్య రూపకాన్ని హనుమకొండలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు ప్రదర్శించనున్నారు. అభ్యుదయ ఆర్ట్ అకాడమీ, ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ భారతీయ బౌద్ధ మహాసభ నిర్వాహకుల ఆధ్వర్యంలో నృత్యరూపకం ప్రదర్శించనున్నారు. నగరవాసులు అధిక సంఖ్యలో హాజరై ప్రదర్శనను తిలకించాలని కోరారు.

ఆర్టీసీలో ఏడీసీ పదోన్నతి కల్పించాలి

హన్మకొండ: అర్హులైన ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు వెంటనే ఏడీసీ పదోన్నతి కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాంచందర్ కోరారు. అన్ని కేటగిరీల్లో పదోన్నతి కల్పించాలని ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేసినా పదోన్నతి కల్పించకుండా వరంగల్ రీజినల్ మేనేజర్ జాప్యం చేస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మే 2 నుంచి 10వ తేదీ వరకు ఏడీసీ పదోన్నతి కోసం సమ్మతి పత్రాలు స్వీకరణకు అవకాశమిచ్చినా చాలామంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు ముందుకు రాకపోవడంతో గడువు మే 20 వరకు పెంచారని తెలిపారు. సమ్మతి పత్రాలు అందించి రోజులు గడుస్తున్నా పదోన్నతి ప్రక్రియ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని పేర్కొన్నారు.

అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే

హసన్‌పర్తి: తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ అన్నారు. హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ కందుకూరి చంద్రమోహన్ పాల్గొన్నారు.